హామీలు కార్యరూపం దాల్చేనా?

- ఉద్యోగావకాశాలు, పరిహారం అందలేదని మొగల్‌పహాడ్ గ్రామస్తుల ఆగ్రహం
- రేపు ఎన్టీపీసీ భూసేకరణపై గ్రామసభ
- పాత విద్యుత్ కేంద్రాల హామీలు పరిష్కరించాలని డిమాండ్



గ్రామసభ నిర్వహించే ఎన్టీపీసీ భూసేకరణ భూములు (ఫైల్)

రామగుండం: తెలంగాణ సూపర్ థర్మల్ పవర్ ప్రాజెక్టు (టీఎస్‌టీపీపీ) నిర్మాణ విషయంలో రెండో విడత ఎన్టీపీసీ భూసేకరణ చేయబోయే మొగల్‌పహాడ్ భూముల గురించి శుక్రవారం గ్రామసభ నిర్వహిస్తామని, మొగల్‌పహాడ్ గ్రామస్తులు హాజరు కావాలని రెవెన్యూ డివిజనల్ అధికారి కార్యాలయం నుంచి ఆహ్వానపత్రాలు పంపించారు. తొలిదశలో ఎన్టీపీసీలో ప్రజాభిప్రాయ సేకరణ ఏర్పాటు చేశారు. సమీప గ్రామాలు, పట్టణ ప్రజలు, వివిధ పార్టీలకు చెందిన ప్రజాప్రతినిధులు ఇప్పటికే ప్రమాదకర స్థాయిలో ఉన్న కాలుష్యంలో బతుకుతున్నామని, మరో మూడు కేంద్రాల ఏర్పాటుతో కాలుష్యం మరింత పెరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు.

అధికారులను నిలదీసేందుకు కార్యాచరణ..

ఎన్టీపీసీ తొలి విద్యుత్ కేంద్రం స్థాపించే సమయంలో బూడిద చెరువు ఏర్పాటు నిమిత్తం 1982లో మొగల్‌పహాడ్ గ్రామ శివారులో 1200 ఎకరాలలో 553 ఎకరాల భూమిని సేకరించారు. తొలినాళ్లలో భూసేకరణ చేసే సమయంలో నిర్వాసితులకు ఉద్యోగావకాశాలు కల్పిస్తామని హామీ ఇచ్చినప్పటికీ నేటికీ కార్యరూపం దాల్చలేదు. కాగా సేకరించిన భూములకు పట్టాదారు, అనుభవదారు పేర్లు వేర్వేరుగా ఉండడంతో భూములకు పరిహారం చెల్లించలేదు. దీంతో నిర్వాసితులు కోర్టును ఆశ్రయించగా 43 ఏళ్లుగా నిర్వాసితులకు పరిహారం అందలేదు. కాగా రెండో విడత నూతన విద్యుత్ కేంద్రాలు ఏర్పాటు చేసేందుకు మిగిలిన భూములను ఎన్టీపీసీ సేకరించేందుకు గ్రామసభ ఏర్పాటు చేసింది. అయితే గ్రామస్తులు అధిక సంఖ్యలో హాజరై ఎన్టీపీసీ అధికారులను నిలదీసేందుకు కార్యాచరణ చేసుకుంటున్నట్లు సమాచారం.



రెవెన్యూ అధికారులు పంపించిన గ్రామసభ ప్రకటన

ఉద్యోగం లేదు.. పరిహారం అందలేదు



మొగల్‌పహాడ్ భూములలో మా తాతల నుంచి నేటి వరకు సాగు చేసుకుంటూ జీవనోపాధి పొందుతున్నాం. సర్వే నెం.2, 23, 24, 53, 54లో మాకు 9.5 ఎకరాల భూమిలో గత ఎన్టీపీసీ యాష్‌పాండ్ ఏర్పాటు కోసం చేసిన భూసేకరణలో 3.5 ఎకరాలు కోల్పోయాం. ఆనాడు నిర్వాసిత కుటుంబాలకు ఉద్యోగావకాశం, పరిహారం అందజేస్తామన్న హామీలు నేటికీ అమలు కాలేదు. మా సమస్యలు సత్వరమే పరిష్కరించి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించిన తర్వాతే ఎన్టీపీసీకి స్వచ్ఛందంగా సహకరిస్తాం. – చిలుక ప్రసాద్, ఎన్టీపీసీ పూర్వ భూనిర్వాసితుడు, మొగల్‌పహాడ్

భూనిర్వాసితులకు ఉద్యోగాలు కల్పించాలి



మాట్లాడుతున్న గ్రామస్తులు

గోదావరిఖని: తమ భూములకు రావాల్సిన పరిహారం ఇవ్వకుండా రైతులను అరెస్ట్ చేసి బెదిరిస్తున్నారని మొగల్‌పహాడ్ గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. గ్రామస్తులను అర్ధరాత్రి అరెస్ట్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించి మరో వైపు ప్రజాభిసేకరణ నిర్వహించారన్నారు. 1987లో యాష్‌పాండ్ కోసం 550ఎకరాలను ఎన్టీపీసీ యాజమాన్యం తీసుకుందని, పూర్తిస్థాయిలో పరిహారం చెల్లించలేదని ఆరోపించారు. నిర్వాసితులకు ఉద్యోగాలు కల్పించలేదన్నారు. 31న మొగల్‌పహాడ్‌లో నిర్వహించే భూసేకరణను అడ్డుకుంటామని పేర్కొన్నారు. తమకు ఏం న్యాయం చేస్తారో ఎన్టీపీసీ యాజమాన్యం చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం 606 ఎకరాలు తీసుకునేందుకు యాజమాన్యం ప్రయత్నం చేస్తోందన్నారు. 1982లో 76మంది నిర్వాసితులు ఉంటే నలుగురికి మాత్రమే ఉద్యోగాలిచ్చారన్నారు. ప్రస్తుత రేట్ల ప్రకారం భూములు కొనుగోలు చేయాలని, భూములు కోల్పోయిన నిర్వాసితులకు ఉద్యోగాలివ్వాలని డిమాండ్ చేశారు. నిర్వాసితులు చిలుక ప్రసాద్, చిలుక రాజేశం, కొలాని శ్రీనివాస్‌రెడ్డి, మల్లేశ్, దుర్గయ్య, రాములు, నర్సయ్య, సంతోష్ పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు గుణపాఠం తప్పదు



మాట్లాడుతున్న ప్రదీప్‌కుమార్

పెద్దపల్లిరూరల్: ప్రజలకు ఉత్తుత్తి హామీలు ఇచ్చిన కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి ఏడాదైనా ఒరిగిందేమీ లేదని, రానున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులను గెలిపించి కాంగ్రెస్‌కు గుణపాఠం చెప్పాలని పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దుగ్యాల ప్రదీప్‌కుమార్ అన్నారు. పెద్దపల్లిలో బుధవారం జిల్లా పార్టీ కార్యాలయంలో ముఖ్య నాయకులు, కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈనెల 26నుంచి నాలుగు పథకాలు అమలు చేస్తామంటూ ప్రజలను నమ్మించి మరోసారి మోసం చేసిందని దుయ్యబట్టారు. కేంద్రంలో నరేంద్రమోదీ సారథ్యంలో అందిస్తున్న నీతివంతమైన పాలనకే ప్రజలు అండగా నిలవాలని కోరారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ మద్దతుతో పోటీ చేయనున్న ఉన్న అభ్యర్థులు మల్క కొమురయ్య (టీచర్ ఎమ్మెల్సీ), అంజిరెడ్డి (పట్టభద్రుల)కి తొలి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. సమావేశంలో రాష్ట్ర నాయకులు చిలారపు పర్వతాలు, తంగెడ రాజేశ్వర్‌రావు, పార్టీ మండల, పట్టణ అధ్యక్షులు రమేశ్, రాకేశ్‌తో పాటు నాయకులు శ్రీనివాస్, సంపత్, శంకర్, రాజగోపాల్, సంపత్‌రావు, రాజన్న, తిరుపతి, కిరణ్, రాజేంద్రప్రసాద్, లత, అనిల్‌రావు ఉన్నారు.

సంక్షిప్త వార్తలు

• చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

కాల్వశ్రీరాంపూర్: మండలంలోని పెగడపల్లికి చెందిన అడ్డగుంట సారంగంగౌడ్(55) చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. మంగళవారం రాత్రి ఇంట్లో పురుగుల మందు తాగి అపస్మారక స్థితికి వెళ్లిన విషయం గమనించిన కుటుంబ సభ్యులు 108 వాహనంలో సుల్తానాబాద్ ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం కరీంనగర్‌కు తరలించారు. చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందినట్లు పోలీసులు పేర్కొన్నారు. మృతుడి కుమారుడు శ్రీధర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

• రోడ్డు ప్రమాదంలో ముగ్గురు విద్యార్థులకు గాయాలు

జ్యోతినగర్: ఎన్టీపీసీ రామగుండం పర్మినెంట్ టౌన్‌షిప్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు విద్యార్థులకు గాయాలయ్యాయి. వివరాలు ఇలా ఉన్నాయి. పర్మినెంట్ టౌన్‌షిప్‌లోని కేంద్ర ప్రభుత్వ నిర్వహణలోని విద్యాలయంలో చదువుతున్న ముగ్గురు మైనర్ విద్యార్థులు బుధవారం బైక్‌పై వెళ్తుండగా రోడ్డుపై ఉన్న క్రేన్ లారీని ఢీకొన్నారు. గాయపడిన ముగ్గురిని స్థానికులు వెంటనే ప్రథమ చికిత్స నిమిత్తం టౌన్‌షిప్‌లోని ధన్వంతరి ఆస్పత్రిలో చేర్పించారు. చికిత్స అనంతరం ఒకరిని గోదావరిఖని ప్రభుత్వ ఆస్పత్రికి, మరొకరిని లక్ష్మీనగర్‌లోని ప్రైవేట్ ఆస్పత్రికి చికిత్స నిమిత్తం తీసుకెళ్లారు. ఇంకొకరిని చికిత్స నిమిత్తం ఆస్పత్రిలోనే ఉంచారు.

• బైక్ అదుపుతప్పి ఒకరికి గాయాలు

రామగిరి: మండలంలోని కల్వచర్ల గ్రామ పంచాయతీ పరిధిలోని గోకుల్‌నగర్ వద్ద బైక్ అదుపు తప్పి సెంటినరికాలనీ నివాసముండే సింగరేణి కార్మికుడు పసునూటి రాజయ్యకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం వ్యక్తిగత పనుల నిమిత్తం రాజయ్య కల్వచర్లకు వస్తుండగా గోకుల్‌నగర్ బజాజ్ షోరూం వద్ద బైక్ అదుపు తప్పి రోడ్డు మీద గల హెచ్చరిక బోర్డుకు తగిలి గాయపడ్డాడు. సెంటినరికాలనీ డిస్పెన్సరీలో ప్రథమ చికిత్స అందించి మెరుగైన వైద్యం కోసం గోదావరిఖని ఆసుపత్రికి తరలించారు.

• మంత్రి చొరవతో నిధులు మంజూరు

రామగిరి: రాష్ట్ర మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు చొరవతో మంథని నియోజకవర్గానికి నిధులు మంజూరయ్యాయని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తోట్ల తిరుపతియాదవ్ బుధవారం తెలిపారు. టీజీఎస్ ఎస్పీడీసీఎల్ మరమ్మతు పనులు, అభివృద్ధి పనుల కోసం రూ.47.15లక్షలు మంజూరైనట్లు పేర్కొన్నారు.

• ఎన్టీపీసీ మల్కాపూర్‌లో అఘోరీ మాత రాకతో సందడి

జ్యోతినగర్: ఎన్టీపీసీ రామగుండం మల్కాపూర్‌లో అఘోరీ మాత సందడి చేసింది. బుధవారం రాత్రి రామగుండం కార్పొరేషన్ ఐదో డివిజన్ మల్కాపూర్(రామయ్యపల్లె)లోని జ్యోతి నివాసానికి అఘోరీ మాత చేరింది. గ్రామస్తులు అధిక సంఖ్యలో అక్కడికి చేరుకున్నారు. అఘోరీ మాత డయల్ 100కు సమాచారం అందించడంతో బ్లూకోల్ట్స్ సిబ్బంది వచ్చారు. తనకు బందోబస్తు ఎందుకు కల్పించడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు.

• దివ్యాంగుల నుంచి దరఖాస్తుల స్వీకరణ

ఎలిగేడు: మండలంలో ఉన్న దివ్యాంగుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఎంపీడీవో భాస్కర్‌రావు తెలిపారు. వందశాతం సబ్సిడీతో రూ.50వేలు, 80శాతం సబ్సిడీతో రూ.లక్ష, 60శాతం సబ్సిడీతో లక్ష నుంచి 2 లక్షల వరకు, రూ.2లక్షల నుంచి రూ.10లక్షల వరకు 40శాతం సబ్సిడీతో ఇవ్వనున్నట్లు ఆయన పేర్కొన్నారు. మండలానికి జనరల్ కేటగిరీలో దివ్యాంగులకు ఒక యూనిట్ మంజూరైనట్లు ఆయన చెప్పారు. ఫిబ్రవరి 2 వరకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని తెలిపారు.

• తపస్ క్యాలెండర్ ఆవిష్కరణ

జూలపల్లి: తపస్ క్యాలెండర్‌ను మండల విద్యాధికారి సరస్వతి సంఘం నాయకులతో కలిసి బుధవారం ఆవిష్కరించారు. స్థానిక ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎంఈవో కాలసూచికను ఆవిష్కరించారు. జిల్లా ప్రధాన కార్యదర్శి దుగ్యాల శ్రీనివాసరావు, టీచర్లు గంగారెడ్డి, జైపాల్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, తపస్ సుల్తానాబాద్ మండల ప్రధాన కార్యదర్శి ఉన్నారు.

ఏపీఏలో పర్యటించిన పర్యావరణ జీఎం



సన్మానిస్తున్న జీఎం వెంకటేశ్వర్లు

రామగిరి: సింగరేణి సంస్థ కార్పొరేట్ పర్యావరణ విభాగం జీఎం బానోత్ సైదులు బుధవారం ఏపీఏ ఏరియాలో పర్యటించారు. పర్యావరణ జీఎంగా బాధ్యతలు చేపట్టిన అనంతరం మొదటిసారి ఏపీఏకు వచ్చిన సందర్భంగా ఏపీఏ జీఎం కొప్పుల వెంకటేశ్వర్లు సన్మానించారు. అనంతరం ఆర్జీ–1, 2, 3, ఏపీఏ ఏరియాల పర్యావరణ విభాగాల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. కేంద్ర పర్యావరణ విభాగం నిబంధనలు, విధి విధానాలు, సూచనలకు అనుగుణంగా ఏరియాల్లో తీసుకుంటున్న చర్యల గురించి వివరించారు. ఏరియా ఇంజనీర్ వై.యాదయ్య, డీజీఎం పి.డి.సుధాకర్, వివిధ ఏరియాల పర్యావరణ అధికారులు పాల్గొన్నారు.

పర్యావరణ విభాగం జీఎంకు సన్మానం



స్వాగతం పలుకుతున్న జీఎం సుధాకర్‌రావు

రామగిరి: సింగరేణి సంస్థ కార్పొరేట్ పర్యావరణ విభాగం జీఎం బానోత్ సైదులు బుధవారం ఆర్జీ–3 ఏరియాలో పర్యటించారు. పర్యావరణ జీఎంగా బాధ్యతలు చేపట్టిన అనంతరం మొదటిసారి ఆర్జీ–3 ఏరియాకు వచ్చిన సందర్భంగా ఆర్జీ–3 జీఎం నరేంద్ర సుధాకర్‌రావు స్వాగతం పలికారు. సన్మానించి మొక్క బహూకరించారు. అనంతరం జీఎం కార్యాలయంలోని సమావేశ మందిరంలో ఆర్జీ–1, 2, 3, భూపాలపల్లి ఏరియాల పర్యావరణ విభాగాల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఏరియా ఇంజనీర్ వై.వి.శేఖర్‌బాబు, ఫైనాన్స్ ఏజీఎం పి.శ్రీనివాసులు, ఏరియా పర్యావరణ అధికారి పి.రాజారెడ్డి, ఏరియా సర్వే అధికారి జనార్దన్‌రెడ్డి, పర్సనల్ విభాగాధిపతి బి.సుదర్శనం, వివిధ ఏరియాల పర్యావరణ అధికారులు పాల్గొన్నారు.

మెడికల్ కార్డుల దరఖాస్తుకు గడువు పెంపు

రామగిరి: సింగరేణిలో ఉద్యోగ విరమణ పొందిన వారు వైద్యసేవలు పొందేందుకు ఏర్పాటు చేసిన కంట్రిబ్యూటరీ పోస్ట్ రిటైర్మెంట్ మెడికేర్ స్కీం కింద సభ్యత్వం పొందేందుకు 31 మార్చి 2025లోపు సంబంధిత గని, విభాగాల్లో సంప్రదించాలని బుధవారం ఆర్జీ–3 జీఎం నరేంద్ర సుధాకర్‌రావు తెలిపారు. ఈ స్కీం కింద సభ్యత్వం కోసం రూ.60వేలు చెల్లించాలని సూచించారు.

క్రికెట్ టోర్నమెంట్ విజేత ఓదెల



ట్రోఫీ అందజేస్తున్న గంట రాములుయాదవ్

ఓదెల: గ్రామీణ క్రీడాకారులు ఉన్నత శిఖరాలను అధిరోహించాలని మాజీ జెడ్పీటీసీ గంట రాములుయాదవ్ ఆకాంక్షించారు. ఓదెల యూత్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన మూడు మండలాల క్రికెట్ పోటీలు నిర్వహించారు. గెలుపొందిన విజేతలకు ఆయన బహుమతులు అందించారు. విన్నర్‌గా గెలుపొందిన ఓదెల జట్టుకు రూ10,016 నగదును నల్ల మనోహర్‌రెడ్డి, రన్నర్‌కు ఓదెల మాజీ జెడ్పీటీసీ రూ.5016 నగదు అందజేశారు. స్థానిక ఆర్ఎంపీ డాక్టర్ సతీశ్ విన్నర్, రన్నర్‌కు షీల్డులు అందజేశారు. బీఆర్ఎస్ నాయకులు సతీశ్, మాజీ ఉపసర్పంచు తీర్థాల కుమార్, నాయకులు గాలి రవి పాల్గొన్నారు.

క్లుప్తంగా

చిత్తశుద్ధితో విధులు నిర్వర్తించాలి



డైరీ ఆవిష్కరిస్తున్న ఎస్ఈ విజేందర్

రామగుండం: ప్రతీ ఉద్యోగి లక్ష్యసాధన దిశగా చిత్తశుద్ధితో విధులు నిర్వహించినప్పుడే ఉత్తమ ఉద్యోగిగా గుర్తింపు వస్తుందని బీ–థర్మల్ సూపరింటెండెంట్ ఇంజనీర్ పి.విజేందర్ అన్నారు. బీ–థర్మల్ పరిపాలన భవనంలో ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ బీసీ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన డైరీని బుధవారం ఆయన ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నూతన విద్యుత్ స్థాపించే అవకాశం ఉండడంతో ఉద్యోగులకు బదిలీ తప్పనిసరి కానుందన్నారు. అసోసియేషన్ లైజన్ ఆఫీసర్ శ్రీనివాస్‌రావు, అధ్యక్షుడు రవికుమార్, కార్యదర్శి యాదగిరి, కోశాధికారి మల్లేశం, సత్యనారాయణరెడ్డి, బాలకృష్ణ, శంకర్, రాజశేఖర్, శివకుమార్, చారి, రాజు, రాజేందర్, నర్సింహులు, కుమారస్వామి, శ్రావణ్ ఉన్నారు.

జిల్లాలో గిరిజన గురుకుల స్కూళ్లు ఏర్పాటు చేయాలి

రామగుండం: జిల్లాలో బాలురు, బాలికల గిరిజన విద్యాలయాలను వేర్వేరుగా ఏర్పాటు చేయాలని జిల్లాస్థాయి విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ ప్రతినిధి బూక్య సాయి రామ్‌నాయక్ కోరారు. బుధవారం రాష్ట్ర గిరిజన శాఖ ప్రిన్సిపాల్ సెక్రటరీకి వినతిపత్రం సమర్పించారు. జిల్లా పరిధిలోని రామగుండం, ధర్మారం, అంతర్గాం, పెద్దపల్లి, రామగిరి, పాలకుర్తి, సుల్తానాబాద్ మండలాల పరిధిలో గిరిజన జనాభా ఉందని గుర్తుచేశారు. ఫలితంగా జిల్లాలోని గిరిజనులు పొరుగు జిల్లాల్లోని గిరిజన విద్యాలయాలకు వెళ్లాల్సి వస్తోందన్నారు. రానున్న విద్యా సంవత్సరం ఆరంభం నాటికి జిల్లా పరిధిలో గిరిజన విద్యాలయం ఏర్పాటు చేయాలని వినతిపత్రంలో కోరినట్లు సాయిరామ్‌నాయక్ పేర్కొన్నారు.

ఆర్టీవో ఆఫీసులో ఉచిత కంటి వైద్యశిబిరం



పరీక్షలు చేస్తున్న వైద్యులు, అధికారులు

పెద్దపల్లిరూరల్: రోడ్లపై వాహనాలు నడిపే డ్రైవర్లకు కంటి చూపు బాగుండాలని, వారంతా అపుడప్పుడు కంటి పరీక్షలు చేయించుకోవాలని ఆర్టీవో రంగారావు సూచించారు. జిల్లా రవాణా అధికారి కార్యాలయంలో బుధవారం ఉచిత కంటి వైద్యశిబిరాన్ని జిల్లా వైద్యాధికారి అన్నప్రసన్నకుమారితో కలిసి ఆయన ప్రారంభించారు. శిబిరంలో డాక్టర్లు రామకృష్ణ, అజయ్‌కుమార్, సమ్మయ్య, షర్మిల వందమందికి వైద్యపరీక్షలు చేయగా 39 మందికి దృష్టి దోషాలున్నట్టు గుర్తించారు.

గంజాయి విక్రయిస్తే కఠిన చర్యలు

రామగిరి: మండలంలో గంజాయి విక్రయిస్తే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై పెట్టం చంద్రకుమార్ అన్నారు. బుధవారం గంజాయి అమ్ముతున్న వ్యక్తులపై కేసు నమోదు చేసి వివరాలు వెల్లడించారు. కల్వచర్లలోని పోచమ్మ ఆలయం వద్ద గంజాయి అమ్ముతున్నారన్న సమాచారం మేరకు బుధవారం ఉదయం సంఘటన స్థలానికి వెళ్లారు. కాగా గ్రామానికి చెందిన చిప్పకుర్తి అజిత్, పెద్దపల్లికి చెందిన పెంచాల సాయికృష్ణ, సుల్తానాబాద్ మండలం కొదురుపాకకు చెందిన దేవర్నేని సుమంత్‌కు గంజాయి అమ్ముతుండగా పట్టుబడ్డారు. అజిత్ పోలీసులను చూసి పారిపోగా ముగ్గురిపై కేసు నమోదు చేశామని, వారి వద్ద 30గ్రాముల గంజాయి, బైక్, ఫోన్ స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

కుంభమేళాకు ప్రత్యేక రైళ్లు ఏర్పాటు చేయాలి

రామగుండం: ఉత్తరప్రదేశ్ ప్రయాగ్‌రాజ్‌లో కొనసాగుతున్న కుంభమేళాకు రాష్ట్రం నుంచి ప్రత్యేక రైళ్లు నడిపించాలని ఫైట్ ఫర్ బెటర్ సొసైటీ ప్రతినిధులు బుధవారం రామగుండం రైల్వేస్టేషన్ సూపరింటెండెంట్‌కు వినతిపత్రం అందజేసి ఎక్స్‌లో పోస్టు చేసినట్లు తెలిపారు. భక్తులకు సరిపడా రైళ్లు అందుబాటులో లేకపోవడంతో భక్తులు ఇబ్బంది పడుతున్నారన్నారు. కుంభమేళాకు మరిన్ని ప్రత్యేక రైళ్లు ఏర్పాటు చేయాలని వారు కోరారు. రేణికుంట్ల నరేంద్ర ఉన్నారు.

కోదండ రామాలయం వార్షిక బ్రహ్మోత్సవాలు

పెద్దపల్లిరూరల్: పట్టణంలోని శాంతినగర్‌లో శ్రీకోదండరామాలయ, సాయినాథ, లక్ష్మీగణపతి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు ఫిబ్రవరి 1 నుంచి ప్రారంభం అవుతాయని ఆలయ అర్చకులు, కమిటీ సభ్యులు తెలిపారు. 22 వసంతాలు పూర్తి చేసుకుంటున్న ఆలయంలో మూడురోజుల పాటు బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నట్లు వారు పేర్కొన్నారు.

సింగరేణి వార్తలు

నూతన యంత్రాలు కొనుగోలు చేయాలి



వినతిపత్రం ఇస్తున్న ఏఐటీయూసీ నాయకులు

గోదావరిఖని: సింగరేణి సంస్థ రామగుండం డివిజన్–2 పరిధిలోని ఓసీపీ–3లో పాడైపోయిన వాటి స్థానంలో నూతన యంత్రాలను కొనుగోలు చేయాలని ఏఐటీయూసీ నాయకులు కోరారు. ఓసీపీ–3మేనేజర్‌కు బుధవారం వినతిపత్రం అందజేశారు. ప్రాజెక్టులోని డంపర్, డోజర్లకు డీజిల్ అందించే బూజర్లు, ఎక్స్‌ప్లోజివ్ మెటీరియల్ తరలించడానికి ఉపయోగించే ఎక్స్‌ప్లోజివ్ వ్యాన్లు కూడా నూతనంగా కొనుగోలు చేయాలన్నారు. వీటిని నడిపించేందుకు సింగరేణి కార్మికులు ఇబ్బంది పడుతున్నారన్నారు. ప్రస్తుతం ఉన్న డిజిల్ బూజర్‌లో డీజిల్ లీకేజీలతో ఫైర్ ఉన్నచోట పనిచేసే సమయంలో ప్రాణాలు అరచేతిలో పెట్టుకోవాల్సిన పరిస్థితి ఉందని తెలిపారు. ఎన్నిసార్లు చెప్పినా అధికారులు సరిగా మరమ్మతు చేయించడం లేదని ఆరోపించారు. కార్యక్రమంలో బ్రాంచ్ సహాయ కార్యదర్శి శ్యాంసన్, ఆర్గనైజింగ్ సెక్రటరీ ఆవుల రవికుమార్, ప్రాజెక్టు సెక్రటరీ ఎం.మహేందర్, ఎన్.ధనుంజయ్, రవికుమార్, శ్రీకాంత్, శ్రీనివాస్, శర్మ, మొగిలి రమేశ్ పాల్గొన్నారు.

కార్మికులకు ప్రతీరోజు మంచినీరు అందించాలి



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

గోదావరిఖని: సింగరేణి కార్మిక కుటుంబాలకు ప్రతీరోజు మంచినీరు అందించాలని ఏఐటీయూసీ నాయకులు మడ్డి ఎల్లాగౌడ్, కె.స్వామి కోరారు. ఏరియా గుర్తింపు సంఘం నాయకులతో యాజమాన్యం బుధవారం స్ట్రక్చర్ సమావేశం నిర్వహించింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉద్యోగ విరమణ పొందిన కార్మికులకు సెటిలింగ్ అలవెన్స్ ఇవ్వాలని, ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి నీరందేలా చూడాలని కోరారు. ఎలక్ట్రీషియన్ పోస్టు భర్తీ చేయాలని, క్వార్టర్ల మ్యూచవల్ కోసం ఐదేళ్ల నిబంధన ఎత్తివేసి రెండేళ్లకు కుదించాలని డిమాండ్ చేశారు. జీడీకే–5 ఓసీపీలో కారు, మోటార్ సైకిల్ షెడ్ నిర్మించాలని, జీడీకే–11వ గనిలో రిపేర్‌లో ఉన్న మ్యాన్‌రైడింగ్ బాగు చేయాలన్నారు. సమావేశంలో యాజమాన్యం తరఫున ఎస్‌వోటూ జీఎం గోపాల్‌సింగ్, ఏఐటీయూసీ నాయకులు ఆరెల్లి పోషం, రంగు శ్రీనివాస్, అధికారులు డీవీరావు, ఆంజనేయులు, శివనారాయణ, చంద్రశేఖర్, కిరణ్‌బాబు, ధనలక్ష్మి, చిలుక శ్రీనివాస్, రమేశ్, జితేందర్‌సింగ్ పాల్గొన్నారు.

ప్రమాదరహిత ఉత్పత్తే లక్ష్యం



మాట్లాడుతున్న జీఎం లలిత్‌కుమార్

గోదావరిఖని: ప్రమాదరహిత ఉత్పత్తే లక్ష్యంగా ప్రతీఒక్కరు బాధ్యతగా ముందుకెళ్లాలని ఆర్జీ–1 జీఎం లలిత్‌కుమార్ సూచించారు. జీడీకే–1, 3 గనులపై బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏరియాలోని జీడీకే–1, 3, జీడీకే–2, 2ఏ, జీడీకే–5 ఓసీపీ, జీడీకే–11 గనుల్లో ప్రమాదాలను నియంత్రించి ప్రమాదరహిత ఉత్పత్తే లక్ష్యంగా ముందుకు సాగాలని ఆదేశించారు. ఉత్పత్తి, ఉత్పాదకత, బొగ్గు రవాణా, నెలవారీగా నిర్దేశించిన బొగ్గు ఉత్పత్తి, రవాణా సాధించేందుకు ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగాలన్నారు. ప్రమాదాల్లేని సింగరేణి కోసం అందరి కృషి అవసరమన్నారు. అనంతరం ఉద్యోగులతో ఆయన రక్షణ ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో అన్నిగనుల రక్షణ అధికారులు శ్రీనివాస్, వెంకటేశ్వర్లు, మల్లేశ్, ఇక్బాల్‌షరీఫ్, టెక్నీషియన్స్, ఉద్యోగులు పాల్గొన్నారు.

పెండింగ్‌లో ఉన్న పదోన్నతులు పూర్తి చేయాలి



మాట్లాడుతున్న ఆర్జీ–2 జీఎం వెంకటయ్య

గోదావరిఖని: ఏరియాలో పెండింగ్‌లో ఉన్న పదోన్నతులు పూర్తి చేయాలని ఆర్జీ–2 జీఎం వెంకటయ్యను గుర్తింపు సంఘం ఏఐటీయూసీ నాయకులు కోరారు. జీఎం కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాలులో బుధవారం నిర్వహించిన స్ట్రక్చర్ సమావేశంలో వారు మాట్లాడారు. మెకానిక్, ఎలక్ట్రీషియన్, ఆపరేటర్ల పోస్టులను భర్తీ చేయాలని కోరారు. సీహెచ్‌పీలో ఫైర్, డస్ట్ నివారణకు పాండ్స్ ఏర్పాటు చేయాలని, జీఎం ఆఫీసులో వాహనాలకు అనుగుణంగా పార్కింగ్ షెడ్లు ఏర్పాటు చేయాలని, కార్మిక వాడలకు మంచినీటి సమస్య వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. 2018 నుంచి 2022 వరకు ఐటీ రిటర్న్స్‌కి సంబంధించి ఐటీ క్లియరెన్స్ చేయాలన్నారు. వకీల్‌పల్లి గని నుంచి యైటింక్లయిన్‌కాలనీ, కాలనీ నుంచి సీహెచ్‌పీ వరకు రోడ్డు మరమ్మతు చేయాలన్నారు. సమావేశంలో యూనియన్ నాయకులు రాజరత్నం, రవీందర్, శ్యాంసన్, జి.సాంబశివరావ్, రవికుమార్, మామిడి మహేందర్, అధికారులు మధుసూదన్, నెహ్రూ, సంతోష్‌కుమార్ పాల్గొన్నారు.

బడిబయటి విద్యార్థులు బడిలో చేరిక



స్కూల్లో చేర్పిస్తున్న అధికారులు

కాల్వశ్రీరాంపూర్: రాష్ట్రం ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన బడి బయటి విద్యార్థుల స్పెషల్ డ్రైవ్ కార్యక్రమంలో భాగంగా బుధవారం మండలంలోని వెన్నంపల్లికి చెందిన కోట సన్నీ అనే విద్యార్థిని అదే గ్రామంలోని జెడ్పీ హైస్కూల్లో చేర్పించారు. తారుపల్లికి చెందిన సూరం శాంతరాజు అనే విద్యార్థిని ముత్తారం మండలం అడవిశ్రీరాంపూర్‌లోని ఓపెన్‌స్కూల్లో చేర్పించారు. ప్రతీఒక్కరు చదువుకోవాలని అందుకే స్పెషల్ డ్రైవ్ ద్వారా బడి బయటి విద్యార్థులను గుర్తించి ఆయా సమీపంలోని పాఠశాలల్లో చేర్పిస్తున్నట్లు ఎంఈవో మహేశ్ పేర్కొన్నారు. సీఆర్పీలు చందు, వీరన్న, కుమారస్వామి, టీచర్లు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కార్మిక పిల్లలను చదివించే బాధ్యత యజమానులదే

సుల్తానాబాద్‌రూరల్: ఇటుకబట్టీల్లో పనిచేస్తున్న కార్మికుల పిల్లలను చదివించే బాధ్యత యజమానులు తీసుకోవాలని జిల్లా అకడమిక్ మానిటరింగ్ అధికారి షేక్ అన్నారు. మండలంలోని కాట్నపల్లిలో ఏబీసీ బ్రిక్స్ కంపెనీలో ఏర్పాటు చేసిన వర్క్‌సైట్ స్కూల్‌ను బుధవారం సందర్శించారు. పిల్లలకు పాఠాలు ఎలా చెప్తున్నారు, వసతులు ఎలా ఉన్నాయని పిల్లలను అడిగి తెలుసుకున్నారు. గర్రెపల్లి హెచ్‌ఎం కవిత, సీఆర్పీ కిరణ్‌కుమార్ ఉన్నారు.

ఉచిత కంటి వైద్యశిబిరం

పాలకుర్తి: బసంత్‌నగర్‌లోని కన్నాల హెచ్‌కేఆర్ టోల్‌ప్లాజా వద్ద బుధవారం ఉచిత కంటివైద్య శిబిరం నిర్వహించారు. గోదావరిఖనికి చెందిన కంటి వైద్య నిపుణులు దుర్గాప్రసాద్ ప్లాజా సిబ్బందికి, కార్మికులకు కంటి పరీక్షలు చేశారు. హెచ్‌కేఆర్, ఫేర్‌వేస్, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

యైటింక్లయిన్‌కాలనీ: సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని గోదావరిఖని టూటౌన్ సీఐ ఎస్.ప్రసాద్‌రావు అన్నారు. టూటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధి యైటింక్లయిన్‌కాలనీ కుమారస్వామి నగర్ ఏరియాలో బుధవారం రాత్రి పోలీస్ కళాబృందం సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెడ్‌కానిస్టేబుల్ కృష్ణారెడ్డి, కళాబృందం పోలీసులు శ్రీనివాస్ సదానందం, బద్రి, అమర్నాథ్, రవీందర్, సమ్మయ్య, గంగా, శ్రీను సంపత్ పాల్గొన్నారు.

స్థానికులకే ఉద్యోగ అవకాశాలు కల్పించాలి

జ్యోతినగర్: ఎన్టీపీసీ సంస్థ నిర్వహించిన ప్రజాభిప్రాయ సేకరణ పోలీసు నిర్బంధాల సేకరణలా ఉందని బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కందుల సంధ్యారాణి బుధవారం ఒక ప్రకటనలో అన్నారు. స్థానికులకే కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు.